క్లుప్తంగా

ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలి

ఖానాపురం: రాజీవ్ యువ వికాసం కోసం లబ్ధిదారులు తమ దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే ప్రతీ దరఖాస్తుదారుడు దరఖాస్తు జిరాక్స్‌లను కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

ఖానాపురం: మండలంలోని రంగాపురంలోని కోదండ రామచంద్రస్వామి ఆలయంలో సప్తమ బ్రహ్మోత్సవ పూజలు ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే పూజా కార్యక్రమాలు శుక్రవారం పూజారుల వేదమంత్రోచ్ఛరణల మధ్య చేపట్టారు. మొదటి రోజు అంకురార్పన, యాగశాల ప్రవేశం, మూర్తి కుంభారాధన, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణతో పాటు గరుడ హోమాలను నిర్వహించారు.

ఆలయ ఈఓకు సన్మానం

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు స్వామి వారి జాతరను విజయవంతం చేయడంతో పాటు ఆలయ ఆదాయం పెరిగేలా చర్యలు చేపట్టినందుకు ఆయనను శుక్రవారం సన్మానించారు. ఆలయం వద్ద జాతర ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ వీరాటి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్‌తో పాటు పలువురు ఈఓను శాలువాతో సన్మానించారు.

లైన్‌మెన్‌కు..

వర్ధన్నపేట : ట్రాన్స్‌కో, జెన్‌కో ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రాంలో సింగింగ్, బలిబండ నాటక ప్రదర్శనలో ద్వితీయ బహుమతి అందుకున్న లైన్‌మెన్‌ను శుక్రవారం వర్ధన్నపేట విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ తరుణ్, లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సెమినార్‌ను జయప్రదం చేయాలి

నర్సంపేట: తెలంగాణ జనసమితి పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 7న కోదండరాం అధ్యక్షతన పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణభారత భవిష్యత్‌పై జరిగే సెమినార్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన పార్లమెంటు స్థానాల పెంపు జరిగితే ఉత్తరాది రాష్ట్రాలకు ఎంపీ స్థానాలు పెరిగి దక్షిణ రాష్ట్రాల్లో వాటి సంఖ్య తగ్గే ప్రమాదం ఉందన్నారు. దక్షిణాది హక్కుల పట్ల ప్రమాదం జరుగుతున్న అన్యాయంపై సీరియస్ చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో పునర్విభజన ప్రక్రియపై ముందుగానే చర్చ జరగాలని అన్నారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



వర్ధన్నపేట : జై బాపు..జైబీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శుక్రవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మైస సురేష్ ఆధ్వర్యంలో పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ పుస్తకాన్ని చేతపట్టుకుని ప్రజలకు రాజ్యాంగ విలువను తెలియపరుస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. నాయకులు కమ్మగోని ప్రభాకర్, సమ్మెట సుధీర్, చీటూరి రాజు పాల్గొన్నారు.

జీఐ సర్టిఫికెట్ లభించడం గర్వించదగ్గ విషయం



నర్సంపేట: నర్సంపేట ప్రాంతంలో పండిస్తున్న చపాట మిర్చికి జియోగ్రఫికల్ ఇండెక్స్ ట్యాగ్(జీఐ) సర్టిఫికెట్ లభించడం గర్వించదగ్గ విషయమని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. చపాట మిర్చికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన పెద్ది సుదర్శన్‌రెడ్డిని శుక్రవారం తిమ్మంపేట చిల్లీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ కంపెనీ లిమిటెడ్ సంఘం డైరెక్టర్లు, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓ సంఘ సభ్యులు, అధికారులు, నియోజకవర్గ రైతులకు పెద్ది కృతజ్ఞతలు తెలిపారు. తిమ్మంపేట మిర్చి ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి: మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన వరంగల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి నారాయణరావు తల్లి సుభద్రదేవి ఇటీవల మృతి చెందింది. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ శుక్రవారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అడుగంటుతున్న 'ఆకేరు'

- చెక్‌డ్యాం తెగిపోవడంతో ఇబ్బందులు
- తాత్కాలిక పనులు చేసినా వరద ధాటికి కష్టమే
- ప్రతిపాదనలు పంపినా మంజూరు కాని నిధులు

వర్ధన్నపేట: ఆకేరు వాగు పరివాహక ప్రాంతం గతంలో పచ్చగా అలరారుతుండేది. ఇసుక తరలింపుతో వాగు లోతు ఏర్పడి చెక్‌డ్యాం తెగిపోయింది. దీంతో వాగు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఇల్లంద, వర్ధన్నపేట, ల్యాబర్తి, కొత్తపల్లి గ్రామాల రైతులు ఆకేరువాగు సమీపంలో వందల ఎకరాల్లో వరిపంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఇబ్బంది లేనప్పటికీ రానున్న రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటి వరి పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది.

చెక్‌డ్యాంకు తాత్కాలిక మరమ్మతులు

గత వర్షాకాలంలో చెక్‌డ్యాం తెగిపోయింది. దీంతో నీరు నిలవకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తాత్కాలిక మరమ్మతుల కోసం నీటి పారుదలశాఖ అధికారులతో మాట్లాడి ఇసుక బస్తాలు, మట్టికట్ట వేసి వరద నీటిని ఆపగలిగారు. శాశ్వత మరమ్మతుల కోసం రూ.2 కోట్లతో నీటి పారుదల శాఖ మంత్రికి ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనలు మంత్రి చాంబర్‌లోనే ఉన్నాయి. నేటికి నిధులు మంజూరు కాకపోవడంతో ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెక్‌డ్యాం తెగిన చోట తాత్కాలిక ఇసుక బస్తాలు, మట్టికట్ట వేశారు. రానున్న వర్షాకాలంలో వరదకు కట్ట కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఈ వేసవిలోనే శాశ్వత మరమ్మతులు చేపడితే వర్షాకాలంలో వచ్చే వరద నీరు చెక్ డ్యాంలో నిలుస్తుంది.



అడుగంటిన ఆకేరు వాగు



తెగిపోయిన చెక్‌డ్యాం ప్రాంతం

కోతకు గురవుతున్న వాగు

తరచూ చెక్‌డ్యాం తెగిపోవడంతో ఆకేరు వాగు ఒడ్డు కోతకు గురవుతోంది. పక్కనే ఉన్న ఇళ్లకు సైతం కోతతో ప్రమాదం ఏర్పడుతోంది. దీంతో వాగు ఒడ్డున ఉన్న ఇళ్ల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు.

శాశ్వత మరమ్మతులు చేపట్టాలి



ఆకేరు వాగు చెక్‌డ్యాంకు తాత్కాలిక మరమ్మతులు చేపడితే సరిపోదు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పందించి శాశ్వత పనులు చేయించి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలి.
– ఈరెల్లి శ్రీనివాస్, వర్ధన్నపేట

అడుగంటుతున్న భూగర్భజలాలు



ఆకేరు వాగు ఎండి పోతుండడంతో భూ గర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉంది. ఈప్రాంత రైతులు, పట్టణ వాసుల కోసం వెంటనే నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. – తుమ్మల కుమారస్వామి, వర్ధన్నపేట

ఛత్తీస్‌గఢ్‌లో నరమేధాన్ని నిలిపి వేయాలి

నల్లబెల్లి : దేశ ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో సృష్టిస్తున్న నరమేధాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎలకంటి రాజేందర్, గంగుల దయాకర్‌లు పిలుపునిచ్చారు. మండలంలోని మురళీనగర్, కొండాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా నక్సలైట్ల నిర్మూలనే ధ్యేయంగా పనిచేయడాన్ని తప్పుపట్టారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 8న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో ప్రజాస్వామిక వాదులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బీమగాని మల్లయ్య, శ్రీధర్, నరేష్, మల్లయ్య, విజయ్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పసుపు పంట పరిశీలన



పసుపు పంటను పరిశీలిస్తున్న జ్యోతి

దుగ్గొండి: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన రైతు లోనె శ్రీనివాస్ సాగు చేసిన సేలం రకం పసుపు దుంపలను డివిజన్ ఉద్యానశాఖ అధికారి జ్యోతి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రీనివాస్ సేలం రకం పసుపు విత్తనాన్ని 30 గుంటలలో బెడ్ పద్ధతిలో సాగు చేశారన్నారు. నీటిని డ్రిప్ ద్వారా అందించారని తెలిపారు. 30 గుంటలలో 20 నుంచి 25 టన్నుల పచ్చి పసుపు దిగుబడి వచ్చిందని పేర్కొన్నారు. అధిక దిగుబడిని ఇచ్చేలా పసుపు పండించిన రైతు శ్రీనివాస్‌ను అభినందించారు. వారి వెంట రైతులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

- సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ వేణుగోపాలాచారి

సంగెం : వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్ వేణుగోపాలచారి సూచించారు. శుక్రవారం కాపుల కనిపర్తి సబ్‌స్టేషన్ ప్రాంగణంలో సంగెం, గీసుకొండ మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిష్కార వేదిక ద్వారా వచ్చిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ సభ్యులు కె. రమేష్, ఆర్. చరణ్‌దాస్, ఎం.రామారావు, ఎస్‌ఏఓ సంజీవరావు, ఏడీఈ నరసింహారావు, ఏఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈలు అశ్విన్, మదుసూదన్, సంపత్‌కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న వేణుగోపాలచారి

గుడుంబా స్థావరాలపై పోలీసు దాడులు

నెక్కొండ : మండలంలోని చిన్నకొర్పోలు శివారు చెరువుముందరి తండా, కునుసోతు తండాల్లో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు దాడులు జరిపారు. నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. శుక్రవారం స్థానిక పోలీసులతో కలిసి నర్సంపేట ఎక్సైజ్, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఆయా తండాల్లోని గుడుంబా స్థావరాలపై దాడులు చేశామన్నారు. దాడుల్లో 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం, 1500 లీటర్ల చెక్కర పానకంను ధ్వంసం చేశామన్నారు. అక్రమ గుడుంబా తయారీకి పాల్పడుతున్న బానోతు బుల్లి, బోడ రవి, కునుసోతు శంకర్‌లపై కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రజిత, టాస్క్‌ఫోర్స్ ఎస్సై రమాదేవి పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

- నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి

నర్సంపేట: సకల జీవకోటికి నీరే ప్రాణధారం అయినందున నీటిని పొదుపుగా వాడుకొని వృథా చేయకుండా భూగర్భ జలాలను రాబోయే తరాలకు మనం అందించాలని నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి సూచించారు. పట్టణంలో ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ, వజినపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రజలందరూ అవసరాల నిమిత్తం నర్సంపేటకు వచ్చే వారికి చలివేంద్రం ద్వారా నీటిని అందించి దాహార్తి తీర్చడం అభినందనీయం అన్నారు. ప్రతిభ సంస్థ అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ స్వచ్ఛమైన నీటిని తాగడంతో 85 శాతం వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. తహసీల్దార్ రాజేష్, వజినపెల్లి లక్ష్మయ్య, వినియోగదారుల విజిలెన్స్ కమిటీ మెంబర్ నాగెల్లి సారంగం, మొగిలిచర్ల రాము, వెంకటచారి, కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ ఉమారాణి

త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

పర్వతగిరి : ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని జమాల్‌పూర్‌లో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేస్‌మెంట్ లెవల్ వారికి త్వరగా డబ్బులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జీపీ ప్రత్యేక అధికారి జి.రాజేష్, పంచాయతీ కార్యదర్శిపి.దివ్య, ఇంటిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వక్ఫ్ బిల్లును వెంటనే రద్దు చేయాలి

ఖానాపురం : కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును వెంటనే రద్దు చేయాలని ఖానాపురం మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ ముస్తఫా, బుధరావుపేట ముస్లిం పెద్ద మౌలానా అబ్దుల్ గఫూర్ సాహెబ్‌లు అన్నారు. మండలంలోని బుధరావుపేట, ఖానాపురం గ్రామాల్లో ముస్లిం కమ్యూనిటీల ఆధ్వర్యంలో వక్ఫ్ బిల్లును నిరసిస్తూ శుక్రవారం వేర్వేరుగా ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులకు, మసీద్‌లకు, భూములకు సంబంధించి మెజారిటీ సభ్యులు ముస్లిమేతర వ్యక్తులు సెంట్రల్ బోర్డులో నియమించడం జరిగిందన్నారు.

జర్నలిస్టుపై దాడి చేసిన వారిని శిక్షించాలి

నర్సంపేట: సీనియర్ జర్నలిస్టు గిరీష్ ముదిరాజ్‌పై దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని 'మెపా' వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టు గిరీష్‌ముదిరాజ్‌పై దాడిని ఖండిస్తున్నామన్నారు. ఇప్పుడిప్పుడే సామాజికంగా, రాజకీయంగా ఎదుగుతుండటంతో పాటు మీడియా రంగంలో రాణిస్తున్న ముదిరాజ్‌లపై దాడులను మోపా తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

దుగ్గొండి : ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కేశవాపురం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన ఓ గిరిజన జంట పెళ్లి వేడుక చేసుకున్నారు. ఈ వేడుకకు నందిగామకు చెందిన యువకులు కూచన నవీన్, జగదీష్, విష్ణులు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై ముగ్గురు కేశవాపురం నుంచి పెంచికలపేట మీదుగా నల్లబెల్లికి బయలుదేరారు. అయితే కేశవాపురం సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి, చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ముగ్గురిలో ఇద్దరి యువకుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

అకాలవర్షంతో దెబ్బతిన్న పంటలు



వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణ పరిధితో పాటు మండలంలోని గ్రామాల్లో గురు, శుక్రవారాల్లో కురిసిన అకాల వర్షంతో వరి, మొక్కజొన్న, మామిడి తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఈనిన వరి నేలవాలింది. వరి కంకులు రాలిపోయాయి. అసలే కొద్దో గొప్పో కాసిన మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని సుమారు 100 ఎకరాలకు పైగా వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

గీత కార్మికులకు సేఫ్టీ కిట్ల పంపిణీ

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరంలోని 16వ డివిజన్ ధర్మారంలో గీసుకొండ, సంగెం మండలాల గౌడ సంఘం సభ్యులకు శుక్రవారం తాటిచెట్లు ఎక్కే టాపింగ్ టెస్ట్‌ను బీసీ సంక్షేమ శాఖ, పరకాల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ట్రైనర్ తాళ్లపెల్లి నర్సయ్య నిర్వహించారు. అనంతరం సుమారు 150 మంది గీతకార్మికులకు కాటమయ్య సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ తాతాజీ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మన్, రవికుమార్, జేపీ రజనీకాంత్, ఎక్సైజ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి మహనీయుల స్ఫూర్తియాత్ర

వర్ధన్నపేట : మహనీయుల జయంతి సందర్భంగా మండల కేంద్రంలో వారి స్ఫూర్తి యాత్రను నిర్వహించడం జరుగుతుందని జయంతి ఉత్సవాల కమిటీ కన్వనర్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద మహనీయుల స్ఫూర్తి యాత్ర కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు.

టీఏఎస్ పట్టణ అధ్యక్షుడిగా భాస్కర్

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన నందిపాక భాస్కర్‌ను తెలంగాణ అంబేద్కర్ సంఘం (టీఏఎస్) పట్టణ అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య తెలిపారు. శుక్రవారం భాస్కర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన అనిల్‌రావు

పర్వతగిరి : వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సన్‌ప్రీత్‌సింగ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేసి అభినందలు తెలిపారు.

వైకుంఠధామాల పరిశీలన

- జేసీబీలతో ముళ్ల చెట్లు, చెత్తాచెదారం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

నెక్కొండ: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం సంబంధిత అధికారులు వైకుంఠధామాలను పరిశీలించారు. ఈ నెల 3న 'ఆఖరి మజిలీకి అవస్థలెన్నో.. శ్మశాన వాటికల్లో కరువైన వసతులు' సాక్షిలో ప్రచురితమైన కథనానికి అనూహ్య స్పందన వచ్చింది. మండలంలోని వైకుంఠధామాలతో పాటు, పల్లె ప్రకృతి వనాలు ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. దీంతో మండలంలోని పలు వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాల్లో పేరుకుపోయిన ముళ్ల చెట్లను జేసీబీల సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



పెద్దకొర్పోలులో ముళ్ల చెట్లను తొలగిస్తున్న జేసీబీ

బిల్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- ఏఐఎఫ్‌టీయూ(న్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం

నర్సంపేట: కమలాపురంలోని బిల్ట్ కార్మికులకు వేతనాలు, బెనిఫిట్స్‌ను చెల్లించాలని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మిల్, హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐఎఫ్‌టీయూ(న్యూ) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేషం మాట్లాడుతూ 1979లో స్థాపించిన బిల్ట్ సుమారు ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి జీవనోపాధి కల్పించిందన్నారు. కానీ, యాజమాన్యం 2014లో ఎలాంటి లాకౌట్ ప్రకటించకుండా పరిశ్రమను మూసివేసిందన్నారు. దీంతో ప్రత్యక్షంగా పని చేసిన 650మంది కార్మికుల కుటుంబాలకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వేతనాలు, జీతభత్యాలు, పీఎఫ్ తదితర బెనిఫిట్స్ చెల్లించాలని లేబర్ కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. మరోవైపు పాలకులు యాజమాన్యాలతో కలిసి కార్మికుల ఉపాధిని దెబ్బతీశారని ఆరోపించారు. కార్మిక సంఘం జిల్లా, పట్టణ నాయకులు మంద మల్లయ్య, మేరుగు జనార్దన్, బొల్లిన రమేశ్, ఎద్దు రాములు, బాబు, రమేశ్, గౌరయ్య, ఐలయ్య, సదానందం, నర్సింగం, మధు, నగేష్, చంద్రయ్య, అర్జున్, సారయ్య, మహేష్, రవి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్మీకి మోడల్ స్కూల్ పూర్వ విద్యార్థి ఎంపిక



మణికుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట: చెన్నారావుపేట మండలం అమీనాబాద్ మోడల్ స్కూల్, కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థి ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన బూరుగు మణికుమార్ ఇండియన్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన సందర్భంగా శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.జ్యోతి, ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మణికుమార్ తన అనుభవాలను పాఠశాల విద్యార్థులతో పంచుకున్నాడు. తాను ఆర్మీకి ఎంపికవడం కోసం ఏ రకంగా కష్టపడ్డాడో విద్యార్థులకు వివరించాడు. మారుమూల గ్రామీణ ప్రాంతమైన లింగగిరి గ్రామంలో పుట్టి భారతదేశ సరిహద్దు రక్షణ కోసం వెళ్లడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. దానికి ఈ పాఠశాలలో ఉపాధ్యాయ బృందం అంతా ఎంతో ప్రోత్సాహం అందించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ఉన్నత స్థాయిలోకి వెళ్లాలని సూచించాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

సంగెం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి గుగులోత్ రాము అన్నారు. శుక్రవారం మండలంలోని నల్లబెల్లిలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో నియమించబడ్డారన్నారు. బడీడు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యహక్కుగా లభించిందని ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించడం ద్వారా విద్యహక్కును వినియోగించుకోవడంతో పాటుగా కుటుంబాల ఆర్థిక పరిపుష్టి లభిస్తుందన్నారు. విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ, ప్రధానోపాధ్యాయులు సుజన్‌ప్రసాద్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రజిత పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్ ఏర్పాటు అభినందనీయం

నర్సంపేట రూరల్ : పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటుచేయడం అభినందనీయమని ఎంఈఓ కొర్ర సారయ్య అన్నారు. మండలంలోని కమ్మపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పరిసరాలు, కలుషితం కాకుండా ఉండేందుకు కిచెన్ గార్డెన్‌లు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పాఠశాల చైర్‌పర్సన్ సరిత, హెచ్‌ఎం ఎస్‌కే సర్దార్, పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : కిచెన్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ సారయ్య

ఆవిష్కరణకు నోచుకోని మహనీయుడి విగ్రహం

సంగెం: మండలంలోని గవిచర్లలో ఏర్పాటు చేసిన మహనీయుడు. మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని పట్టించుకునే నాథుడు లేక కళావిహీనంగా తయారైంది. గవిచర్లలో ఏర్పాటు చేసేందుకు విగ్రహం తీసుకుని వచ్చి ముందుగా ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేయడానికి గ్రామానికి చెందిన బాషిపాక రమేశ్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం తీసుకొచ్చి సంగెం రోడ్‌లో ఎస్సీ కాలనీలో ఏర్పాటుకు గద్దె కట్టి ఉంచారు. అక్కడ వద్దని గుండబ్రహ్మయ్య వద్ద ఏర్పాటుకు గొయ్యి తీశారు. అక్కడ వద్దని చివరకు మూడో చోట క్రీడా ప్రాంగణం వద్ద గద్దె కట్టించి ఉంచారు. విగ్రహం తీసుకొచ్చి సుమారు 15 ఏళ్లు అవుతుండడంతో చేయి విరిగి ఆవిష్కరణ, ఆదరణ లేక కళావిహీనంగా తయారైంది. నిధులు లేక ఆవిష్కరించలేని పరిస్థితిలో విగ్రహం అలానే ఉండిపోయింది. ఈ నెల 5న శనివారం బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి. ఇప్పటికైనా దాతలు ముందుకు వచ్చి విగ్రహాన్ని ఆవిష్కరింపజేసి భావితరాలకు ఆయన గొప్పతనం తెలిసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



గవిచర్లలో ఆవిష్కరణ, ఆదరణ లేక కళావిహీనంగా ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం

సన్నబియ్యం పంపిణీతో పేదలకు మేలు



వర్ధన్నపేట : సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి రాజమణి



నల్లబెల్లిలో..

సాక్షి, నెట్‌వర్క్ : సన్నబియ్యం పంపిణీతో పేదలకు ఎంతో మేలు చేకూరిందని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట, సంగెం, నల్ల బెల్లి, రాయపర్తి మండలాల్లోని గ్రామాల్లో రేషన్‌షా పుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.